22-3-57

రానురాను

# మన వడ్డించేవాళ్లు

టి. వి. శంకరం

“డిటెక్టివు అంతక హద్భుతరచనా ప్రెవీణ శ్రీయుత టి వి. శంకరంగారికి, మీ అభిమాన రచయిత ఫలానా ఫలానా నమస్కరించి వ్రాయడ మేమనగా, నిన్నరాత్రి నిద్రపట్టక ఒక పత్రిక తిరగవేస్తూండగా అందులో నేటి తెలుగు వాఙ్మయకర్తలు అనే వేసం కనబడి నది. దానిని నహశిహపరియంతము సమీకించి చూచినాను అందులో ప్రఖ్యాత అభిమాన రచకులైన మీ పేరు ఎక్కడా కనిపించలేదు. ఇది పక్షపాతము కాదా?....”

మిగిలిన ఉత్తరం అచ్చులోకివచ్చి తెలుగు “వాఙ్మయం”లో శాశ్వతంగా నిలిచిపోవటం అంత వాంఛనీయం కాదు మన అభిమాన రచయితలకు ఏమాత్రం అవమానం కలిగిందని పించినా మనకు ఆగ్రహం రావటం సహజం. వాళ్లను పబ్లిషర్లు గాని, పత్రికలవాళ్ళు గాని డబ్బు ఎగగొట్టారంటే మనం అంత బాధ పడం, కాని దొడ్డి సంభావనల్లాటి విమర్శక వ్యాసాల్లో మన అభిమాన రచయిత పేరు కనిపించకపోతే చచ్చే కోపం వస్తుంది.

ఈ ఉత్తరం రాసిన “నా అభిమాన రచయిత”ను నే నెరగను. కాని పేరు అచ్చులోకి ఎక్కాక అభిమానించే వాళ్ళుండక పోతారా? అతను చెప్పే వ్యాసంకూడా నేను చూడలేదు. ఆ వ్యాసంలో నన్ను గురించి ఏమీ లేనందుకు అతనికి కోపం రావటమే నన్నుకొంచెం ఆశ్చర్య పరిచింది. తరుచు ఈ సాహిత్య సమీక్షలు రాసేవాళ్ళు ఎటువంటివాళ్ళో, వాళ్ళు ఎటువంటి పరిస్థితులలో వాటిని రాస్తారో ఆ అబ్బికి తెలీదు

నేనొక రచయితను ఎరుగుదును. అతను అమాంబాపతు విషయాలను గురించి పత్రికలలో రాస్తూం డేవాడు. అయితే వాటిని ఎవరూ చదివేవారుకారు, తలిచేవారుకారు, చెప్పకునే వారుకారు. అతను ఏ బుద్ధినోఉండి “మన కథకులు” అని ఒకవ్యాసం రాశాడు వెంటనే “గోల్” చేసి ఊరుకున్నాడు!

అది అచ్చయిన రోజునే నలుగురు అతనితో, “కథలమీద ఏదో రాశావే?” అని ప్రశంస ధ్వనించేటట్టూ, నిలవదీసి అడిగితే “నేను ఆ వ్యాసాన్ని మెచ్చుకోలేదే?” అనటానికి వీలుగానూ అన్నారు

ఆ వ్యాసంలో మెచ్చుకోబడ్డ ఒకకథకుడు, తనను మెచ్చుకున్నందుకు థాంక్స్ చెప్పలేదు గాని, “మీరు రాశారుచూడండీ? ఆ ధోరణిలో విమర్శక వ్యాసాలు విరివిగా రావటం ఎంతైనా అవసరం మీరు నిజంగా తెలుగు సాహిత్యానికి మంచి సేవచేశారు,” అన్నాడు.

ఇది యుద్ధానికి పూర్వంసంగతి ఆ తరవాత సమీక్షలు రాయటంలో గల సౌకర్యం అందరూ తెలుసుకున్నారు అటువంటి వ్యాసాలను పాఠకులేగాక రచయితలుకూడా చదువుతారు (కొందరు చదివినట్టు మొహం పెడతారు కొందరు బిడియం విడిచేసి చదివామని ఒప్పకుంటారు )

సమీక్షలు రాయటంలో చిక్కులు లేవని కాదు. రాతగాళ్లు ఉన్మాదులతో సమానం ముఖ్యంగా వాళ్ళ కీర్తివిషయంలో సమీక్షకులు వాళ్లను విమర్శించినా, తక్కువ చేసినా తుఫాను రేపేస్తారు వాళ్లను తృణీకరించి, అసలు వాళ్ల ప్రశంసే మానేస్తే చంపేస్తారు.

ఇందుకు సమీక్షకుడు ఒడిగట్టాలి నన్నడిగితే, ఇది పెద్దప్రమాదంకూడాకాదు ఎందుకంటే మనిషి యొక్క అహంకారానికి తగిలే గాయాలు అతి సులువుగా మానిపోతాయి (నన్నే ఉదాహరణగా తీసుకోండి.నాకు ఉత్తరంరాసినమనిషి

నాపేరు ఫలానానమీక్షలో లేదనేసరికి చాలాబాధ కలిగింది. ఆ మనిషే సమీక్షకుణ్ణి తిట్టేసరికి అంత బాధాపోయింది "ఈ సమీక్షకుడు నా గొప్పతనం తెలుసుకోలేని బడుద్ధాయి అని తెలుసుకున్నవాళ్లున్నారు గదా! ఇక భయం లేదు!" అని నాలోనేను అనుకున్నానన్నమాట )

సమీక్షకుడు గొప్ప సమీక్షకుల లిస్టులో చేరటానికి కావలసింది మరింత విమర్శనా దక్షత కాదు—ధైర్యం. అందరినీ నిశితంగా విమర్శించేవాడు ఎప్పుడన్నా దారి తప్పి ఎవణ్ణయినా కాస్త మంచిమాట అంటే వాడు "యావజ్జీవం హెూష్యామి" అయిపోతాడు ఈవిధంగా ప్రశంసను గరళంలాగా వాడుతూ కాలక్రమాన గొప్ప వైద్యుడు—కాదు, విమర్శకుడు అయిపోవచ్చు. కావలిసింది ధైర్యం.

ఈ మధ్య ఒక మిత్రుడు, "ఏమయ్యా, ఇప్పుడు డిటెక్టివు సాహిత్యం ముమ్మరంగా ఉంది గదా, ఈ సాహిత్యాన్ని సమీక్షిస్తూ ఒక వ్యాసం రాయగూడదూ?" అని అడిగాడు

నాకొక సిద్ధాంతం ఉంది. మొద్దులాగా తిరిగే వాడికి మందులూ, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్లూ ఎంత అనవసరమో, నలుగురూ ఎగబడి చదివే సాహిత్యానికి సమీక్ష అంత అనవసరం. ఏ బాపతు సాహిత్యంగాని దిగజారి పోతున్నదనో ఎక్కిరావటం లేదనో తోచినప్పుడే "జై"లు కొట్టాలి. "ఇక దక్కడు" అని తోస్తేనేగాని సన్మానాలు చెయ్యగూడదు. భమిడిపాటివారి "ఎప్పుడూ ఇంతే" గాళ్లు చెప్పినట్టు, బతికుండగా మెచ్చుకోవటం అయుక్తం!

అయితే ఇదంతా నా మిత్రుడితో నే ననలేదు. "డిటెక్టివు సాహిత్యం మహా సముద్రంమీద ఉప్పెనలాగా వస్తున్నది గదా, దీన్ని సమీక్షించే అర్హత నా కెక్కడిది?" అన్నాను

నా స్నేహితుడు నాకేసి వింతగాచూసి, "ఏం? నీకు జుట్టు నెరిసిందే? ఒకటో, అరో పళ్లు కూడా ఊడాయనుకుంటాను?" అన్నాడు

నేను ఆశ్చర్యపోయి, "దానికీ సమీక్షకూ ఏమిటి సంబంధం?" అని అడిగాను

"నీకింకా తెలీదా?" అన్నట్టు నవ్వి, నా స్నేహితుడు, "చాలా సంబంధం ఉంది అసలు ఆ రెంటినీ వేరు చెయ్యటానికి వీల్లేదు" అన్నాడు.

అతని ద్వారా నేను అనేక కొత్తవిషయాలు తెలుసుకున్నాను. వాటిని కాపీ రైటు హక్కులూ లేకుండా ప్రపంచానికి ఇచ్చేస్తున్నాను.

దేశం స్వతంత్రమై మనకు ఇంపీరియలిస్టుల మైత్రీ, జమీందారు-పెట్టుబడిదారు సోషలిజం, ప్రపంచ వర్షప్రణాళికలూ మొదలైనవాటితో బాటు సాంస్కృతిక వికాసం హైడ్రోజెన్‌బాంబే ఫాలౌట్ లాగా దేశమంతటా పడటంవల్ల కళల ఉద్ధరింపు జోరుగా సాగటానికి రకరకాల అకాడమీలూ, సంఘాలూ, సెమినార్లూ, పుస్తకాల పోటీలూ, బహుమతులూ, ప్రభుత్వ సన్మానాలూ, బిరుద ప్రదానాలూ విచ్చలవిడిగా సాగుతున్నాయి.

ఈ అమోఘమైన చైతన్యం వెంట అనేక మంది వ్యక్తులు కీలక స్థానాలలో ఉంచబడ్డారు. వారి పని ఏమిటంటే, బిరుదించవలసిన, సన్మానించవలసిన, బహూకరించవలసిన వారి జాబితాలు వెయ్యటం

ఈ కీలకస్థానాల్లో ఉండేవారికి జుట్టు నెరవటమూ, పళ్ళూడటమూ ముఖ్యమైన అర్హతలు. కించిత్తు అంధత్వమూ, బధిరత్వమూ ఉంటే ఇంకా మంచిది

వీరు ముందుగా కొన్ని జాబితాలు తయారు చేస్తారు ఈ జాబితాలలో అర్ధ శతాబ్దం క్రితం అంటే 1907కు పూర్వం అనుకుందాం—సుప్రసిద్ధ కళాకారులుగా, రచయితలుగా, వగైరా వగైరాగా ఉండిన వారిపేర్లుంటాయి. వీరిలో ఎవరెవరు పరమపదించారో వారి పేర్లను ఎర్ర పెనసలుతో కొట్టేస్తారు. (ఇందులో కమ్యూనిస్టు ప్రచారం ఉందనుకునేరు. నీలం పెనసలైనా పనికొస్తుంది కాని రెండు రంగుల పెనసళ్లతోనూ పని ఉంది అందుచేత మనం ఎర్ర పెనసలును వదిలించుకోలేం )

ఆ తరవాత, ఎర్రపెనసలుతో కొట్టివెయ్యగా మిగిలినవాళ్ళలో ఇప్పటికీ ఉధృతంగా జనాదరణ పొందుతున్న వాళ్లెవరైనా ఉన్నారేమో విచారించాలి. యాభైఏళ్ల తరవాత ఇంకా బతి-

ఉండటమేగాక, కళాజీవిగా కూడా బతికిఉన్న వాడెవడైనా ఉంటే వాడిపేరు నీలం పెనసలుతో కొట్టెయ్యాలి. (దీనితో పని ఉంటుందని నేను ముందే చెప్పాను)

ఆ తరవాత మిగిలినవాళ్ళందరికీ బిరుద ప్రదానాలూ, శాలువలూ, ఫోటోలూ, బహుమానాలూ ఇచ్చెయ్యొచ్చు. కళోద్ధరణ చెయ్యటానికిదే సంప్రదాయసిద్ధమైన పద్ధతి

ఇంత దేశంలో, ఇన్ని భాషలలో కళలను ఉద్ధరించటం సామాన్యమైన విషయం కాదు ఆ కార్యక్రమం కింద ఉత్తమ రచయితల రచనలన్నిటినీ ఏర్చికూర్చి, ఆటే మార్చకుండా తర్జుమాలు కూడా చేయించి, ప్రచురించాలి సింహావలోకనాలు రాయించాలి వీటికి జుట్టు నెరిసి, పళ్లూడిన నాలాటివాళ్లను మంచి జీతాల మీద నియమించాలి,

వీళ్లు చేసేపని చరిత్ర ప్రసిద్ధమే అయినా చెయ్యటం చాలా సులువైనది ఉత్తమ రచనలను ఏరటానికి నన్నే నియమిస్తే నేనేం చేస్తానంటే ముందు నా బంధు మిత్రుల్లో రచయితలనిపించుకున్నవాళ్ల పేర్లన్నీ రానుకుంటాను అప్పటికే పని ముగిసిపోవచ్చు ఒకవేళ ముగవకపోతే నాకు అభిమానులైన వాళ్లను పిలిచి, "తమ్ముడూ, నీకు నచ్చే ముగ్గురు (లేక, నలుగురు) రచయితల పేర్లు కోరుకో. వాళ్ల రచనలు సాహిత్య వేదంలోకి ఎక్కేట్టు నేను నీకు వరమిస్తున్నాను!" అంటాను

కాని నా బంధు మిత్రుల్లోనే కొందరి పేర్లు తగ్గించవలిసి వచ్చిందో, చచ్చానే! నా పాట్లు ఆ ఈశ్వరుడి కెరుక!..

సమీక్షలుకూడా చాలా సులువుగా రాయవచ్చు. నా చిన్నతనంలో నేనెరిగిన రచయితలందరికీ తలాఒక పేరా పారేస్తాను మిగిలిన చోటులో కొద్దిమంది ఆధునికులకు స్థానం ఇవ్వవచ్చు వీళ్ళలో మనకు నచ్చనివాళ్లు చాలా మంది ఉంటారు. వాళ్ళను వొదిలేసి చరిత్రలో వాళ్ల పేర్లు ఒక అర్థ శతాబ్దంపాటు లేకుండా తుడిపెయ్యవచ్చు. ఇది మంచి అవకాశం. మిగిలినవాళ్ళలో నేను ఎరిగిన వాళ్లను గురించీ, వాళ్ళు రాసినట్టు నాకు తెలిసిన ఒకటి రెండు రచనలను గురించీ రాయవచ్చు.

ఇందుకుగాను ఆటే శ్రమపడటం వృథా. ఇదే మాటలు పత్రికలకు రాయటమైతే చాలా బాధ్యతతో కూడుకున్న పని. నెల తిరిగేసరికల్లా ఫెడీలుమని ఆ పత్రికలోనే సమాధానం. లేక విమర్శ వచ్చేస్తుంది అకాడమీలవాళ్ళ పుస్తకాలు అర్థ శతాబ్దందాకా మళ్ళీ రావు అవి అన్నీ లైబ్రరీల్లోనూ పెడతారు వాటికి ఎవరైతే రాస్తారో వారే క్రియకు సంపాదకులు కూడానూ అంటే, రాసినది అచ్చుపడకుండా చూసే నాథుడుండడు ఇంకో సౌకర్యమేమిటంటే, వాటిని ఎక్కువమంది చదవనుకూడా చదవరు...

ఇటువంటి సమీక్షకులు తమను మెచ్చుకోనందుకు రచయితలు బాధపడనవసరంలేదని నా నమ్మకం ఎందుచేతనంటే, నాకు ఉత్తరం రాసిన పెద్దమనిషి (లేక, చాలా చిన్న మనిషేనో!) మెచ్చుకుంటే ఎంత? మెచ్చుకోకపోతే ఎంత?

అతనికి ఈ విధంగా ఉత్తరం రాశాను:

"అయ్యా, తమ ఉత్తరం అందింది. తమరు తెలిపిన సమీక్ష గురించి వాకబుచేశాను. అది రాసిన పెద్దమనిషి గురించి నాకు కూడా ఏమంత ఘనమైన అభిప్రాయం లేదు ఇట్లు. టి. వి శంకరం"

---

ఎంతో విస్తారంగానూ, గణించడానికి వీలు లేకుండానూ ఉన్నవాటిని సముద్రంతో పోల్చడం కవిత్వ సంప్రదాయం. అయితే, బ్రిటిషు సాగర శాస్త్ర జాతీయ సంస్థ సాగిస్తున్న పరిశోధనలు సఫలమయినట్లయితే, ఇలాంటి పోలిక అసంబద్ధమూ, అర్థ రహితమూ అవుతుంది.